RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్
దినపత్రిక

వరంగల్ | గురువారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 180 | జూన్ 12, 2025 | వెల : రూ.3-00



**తప్పిపోయిన వృద్ధుడిని కుటుంబ సభ్యులకు అప్పజెప్పిన పోలీసులు**

4లో..



## మరణించిన పోలీస్ కుటుంబానికి భద్రత చెక్కు అందజేత

**వేద న్యూస్, వరంగల్ క్రైమ్:**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పోలీస్ కంట్రోల్ రూంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ అనారోగ్య కారణాలతో హాస్పటల్‌లో చికిత్స పొందుతూ ఈ ఏడాది జనవరి 28వ తేదీన మరణించిన కానిస్టేబుల్ వెంకటరమణ కుటుంబానికి పోలీస్ భద్రత విభాగం మంజూరు చేసిన రూ.7,72,637 చెక్కును వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ చేతుల మీదుగా చెక్కును మరణించిన కానిస్టేబుల్ భార్య వాణికి అందజేశారు. ప్రస్తుతం మరణించిన కాని స్టేబుల్ కుటుంబ స్థితిగతులపై పోలీస్ కమిషనర్ ఆరా తీశారు. అదనపు డీసీపీ రవి, సూపరింటెండెంట్ రామాదేవి పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం సామాజిక బాధ్యత




4లో..





# ముగిసిన విచారణ!

## 'కాళేశ్వరం'పై..18 ప్రశ్నలు, 50 నిమిషాలు..

### 115వ సాక్షిగా కేసీఆర్‌ను ప్రశ్నించిన కమిషన్ చైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి :**

మాజీ సీఎం కేసీఆర్ ను కాళేశ్వరం కమిషన్ విచారించింది. విచారణ ముగిసింది. దాదాపు 50 నిమిషాల పాటు ఎంక్వైరీ సాగింది. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి కేసీఆర్‌ను కమిషన్ చైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్ ప్రశ్నించారు. కేసీఆర్ ను115వ సాక్షిగా కాళేశ్వరం కమిషన్ విచారించింది. జలుబుతో స్వల్ప అనారోగ్యంగా ఉందని, అనారోగ్యం వల్ల విచారణ సమయంలో ఎవరూ ఉండొద్దని మాజీ సీఎం కేసీఆర్ కోరారు. దీంతో కేసీఆర్ ఆనారోగ్యం కారణంగా బహిరంగ విచారణను రద్దు చేసిన కమిషన్.. ఇండోర్‌లో ముఖాముఖిగా విచారించారు. ఇప్పటి వరకు కాళేశ్వరం కమిషన్ 114 మందిని విచారించింది. ఈ సందర్భంగా కమిషన్‌కు కేసీఆర్ పలు డాక్లుమెంట్లను అందించారు. మొదట దైవసాక్షిగా వాస్తవాలు చెబుతానని కేసీఆర్ చేత ప్రమాణం చేయించిన కమిషన్ చైర్మన్ పీసీ ఘోష్.. మొత్తం 18 ప్రశ్నలను ఘోష్ అడిగారు. రీ ఇంజనీరింగ్, కార్పొరేషన్ ఏర్పాటు, కేబినెట్ ఆమోదంపై కమిషన్ ప్రశ్నలు వేసింది. రీ ఇంజనీరింగ్ చేయడానికి ప్రధాన కారణాలను కేసీఆర్ సుదీర్ఘంగా వివరించారు. ప్రతిదీ కేబినెట్ ఆమోదంతో జరిగిందని కేసీఆర్ వివరణ ఇచ్చారు. కేబినెట్ ఆమోదంతోనే ప్రభుత్వం అన్ని నిర్ణయాలు తీసుకుందన్నారు. స్థల మార్పు నీటి లభ్యత, కాళేశ్వరం నిర్మాణంపై వ్యాప్కోస్ నివేదిక ఇచ్చిందని కమిషన్‌కు చెప్పారు. లైఫ్ లైన్ కాళేశ్వరం పుస్తకాన్ని కమిషన్‌కు అందజేశారు. అందులో కాళేశ్వరం ఉద్దేశ్యాలను వివరించారు. నిధుల సమీకరణ కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేశామని.. బ్యారేజీల్లో నీటి నిలువ అనేది ఇంజనీర్లు తీసుకునే నిర్ణయం తనకు సంబంధం లేదని కేసీఆర్ వెల్లడించారు.

బ్యారేజీల్లో నీటి నిల్వ కోసం మీరేమైనా ఆదేశాలు ఇచ్చారా? అని కమిషన్ ప్రశ్నించగా... తాను అలాంటి ఆదేశాలు ఇవ్వలేదని.. బ్యారేజీలు నీటిని ఎత్తిపోయడానికి నిర్మించినవి అని కేసీఆర్ సమాధానమిచ్చారు. ప్రాజెక్ట్ లొకేషన్ మార్పు నిర్ణయం ఎవరిది అంటూ కమిషన్ మరో ప్రశ్న సంధించింది. లొకేషన్ ఎందుకు మార్చాల్సి వచ్చిందో కేసీఆర్ సుదీర్ఘంగా వివరించారు. సీడబ్ల్యూసీ తుమ్మిడి హట్టి వద్ద నీటి లభ్యత లేదని చెప్పిందని.. వ్యాప్కోస్ సర్వే చేసి నివేదిక ఇచ్చిందన్నారు. టెక్నికల్ టీం మూడు బ్యారేజీలు నిర్మించాలని చెప్పిందన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణానికి మహారాష్ట్ర అంగీకరించలేదని చెప్పారు. టెక్నికల్ టీం ఇచ్చిన నివేదిక మేరకు లోకేషన్ మార్పు జరిగిందన్నారు. నిర్ణయాలన్నీ కేబినెట్ ఆమోదంతోనే జరిగాయని కేసీఆర్ తెలిపారు. విచారణ ముగిసిన తర్వాత బీఆర్కే భవన్ ముందు మాజీ సీఎం కేసీఆర్ కార్యకర్తలకు అభివాదం చేశారు. అనంతరం అక్కడ నుంచి కేసీఆర్ వెళ్లిపోయారు.



## భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి చట్టం

### జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**

భూ భారతి చట్టం ద్వారా భూ సమస్యలకి పరిష్కారం లభిస్తుందని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. కాగా ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బుధవారం వేములపల్లి మండల కేంద్రంలోని మొల్కపట్నం గ్రామంలో జరుగుతున్న రెవిన్యూ సదస్సులో ఆయన పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 20 వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొల్కపట్నం గ్రామంలో నిర్వహించిన రెవిన్యూ సదస్సు ద్వారా 61 ధరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఇప్పటివరకు మండల వ్యాప్తంగా రెవెన్యూ సదస్సు ద్వారా 493 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. రెవిన్యూ సదస్సులలో రైతులు తమ భూములకి సంబందించి అన్ని సర్టిపికెట్లు జత చేసి భూ సమస్యలను ధరఖాస్తు రూపంలో సమర్పించాలని తదుపరి అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేసి సమస్య పరిష్కరించటం జరుగుతుందని తెలిపారు. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా వచ్చిన దరఖాస్తులను కంప్యూటర్లో అప్లోడ్ చేశామని పేర్కొన్నారు. 2020 వరకు వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ చేసి 13 బి జారీ చేస్తామని వివరించారు. జిల్లా వ్యాప్తంగా వచ్చిన దరఖాస్తులను ఆగస్టు 15 లోపు పూర్తి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వేములపల్లి తహసిల్దార్ హేమలత, డిప్యూటీ తహసిల్దార్ కోటేశ్వరి, ఆర్ఐలు మహేందర్ రెడ్డి, స్పందన రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ సరిత, కంప్యూటర్ ఆపరేటర్లు హర్ష, గణేష్ పాల్గొన్నారు.

## మహోద్యమంలా వనమహోత్సవం..!

- రాష్ట్ర మంత్రి కొండా సురేఖ

**వేద న్యూస్, హైదరాబాద్ :**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టదలిచిన వనమహోత్సవం కార్యక్రమాన్ని ఫారెస్టు డిపార్టుమెంటు అధికారులు మహోద్యమంలా తీసుకొని ముందుకు వెళ్ళాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చెప్పారు. వృక్షో రక్షిత రక్షితః నినాదాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్ళాల్సిన అవసరం ఉందని ఆమె పునరుద్ఘాటించారు. వన మహోత్సవం-2025 పోస్టరు బుధవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఆవిష్కరించారు. పోస్టరు ఆవిష్కరణలో తెలంగాణ అటవీ ప్రధాన సంరక్షిణాధికారిణి డాక్టర్ సువర్ణ, సీసీఎఫ్ ప్రియాంక వర్గీస్, సోషల్ ఫారెస్టు రామలింగం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ ఈ ఏడాది తలపెట్ట బోయే వనమహోత్సవ కార్యక్రమం వంద శాతం విజయవంతం అయ్యేలా చూడాలన్నారు. అన్నివర్గాల వారు ఈ బృహత్తర కార్యక్రమంలో భాగస్వామ్యం అయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. నాటిన ప్రతీ మొక్కను బతికించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. నాటిన మొక్కలకు నీటి సదుపాయం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పండ్ల మొక్కలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. జిల్లాల్లో జూన్, జూలై, ఆగస్టు మాసాల్లో మొక్కలు నాటేందుకు ప్రణాళికతో ముందుకు వెళ్ళాలని సూచించారు. 2024 సంవత్సరం డిపార్టుమెంటువారీగా, డిస్టిక్ వారీగా రాష్ట్రవ్యాప్తంగా 20.02 కోట్ల మొక్కలు నాటాలని ప్రణాళికలు వేసుకోగా..19.04 కోట్లు నాటినట్టు మంత్రి సురేఖ గుర్తు చేశారు. 95 శాతం మేరకు అంచనాలు రీచ్ అయినట్టు వెల్లడించారు. ఈ సారి 100 శాతం మనం పెట్టుకున్న టార్గెట్ రీచ్ కావాలని దిశానిర్దేశం చేశారు. ప్రతి గ్రామంలో వన నర్సరీల ద్వారా మొక్కలు పెంచి అదే గ్రామంలో నాటించడానికి ఏర్పాట్లు చేయాలని సూచించారు. గతంలో ఎదురైన అనుభవాలు, తప్పిదాలు పునరావృత్తం కాకుండా అవసరమైన జాగ్రత్తలను అధికారులు తీసుకోవాలన్నారు. ప్రతీ ఇంటికి మొక్కలు ఇచ్చి నాటేందుకు ప్రోత్సహించాలని చెప్పారు. ప్రజలు అడిగిన మొక్కలను అందజేయడానికి అధికారులు సిద్దంగా ఉండాలన్నారు. ఇండ్లలో ప్రధానంగా పెంచే గులాబీ, మందార, సీతాఫలం, జామ, ఉసిరి, అల్ల నేరేడు, మునగ, కానుగ, తులసి, ఈత మొక్కలతో పాటు పలు ఔషధ మొక్కలు, పూల మొక్కలను సిద్ధం చేయాలని ఆదేశించారు. పూల మొక్కలను ప్రభుత్వ స్థలాలు, రహదారులకు ఇరువైపులా, పొలం, చెరువు గట్లు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు సంస్థలు, పరిశ్రమలు, కమ్యూనిటీ కేంద్రాలు, వైద్య శాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల ఆవరణల్లో నాటేందుకు ప్రణాళిక రూపొందించాలని మంత్రి సురేఖ ఆదేశించారు.




గతం కంటే ఈసారి మాన్ సూన్ ముందే వచ్చిందని..ఈ నేపథ్యంలో అందరూ సన్నద్ధంగా ఉండాలన్నారు. ఏ ఏరియాలో ఎటువంటి చెట్లు నాటాలో గుర్తించి ఆ విధంగా ముందుకు వెళ్ళాలని మంత్రి సూచించారు. ఈ దఫా వనమహోత్సవంలో ఈత, తాటి, వేప, చింత, కుంకుడు మొక్కలు నాటించాలన్నారు. పెద్ద ఎత్తున మొక్కలు నాటిన వారికి గుర్తించి ప్రోత్సాహకాలు ఇవ్వాలని మంత్రి సురేఖ అధికారులను ఆదేశించారు.

మొక్కల పెంపకంలో ప్రత్యేకంగా కృషి చేసిన వారికి పలు విధాలుగా గుర్తింపు ఇవ్వాలని అటవీ శాఖ ఉన్నతాధికారులకు చెప్పారు.

## పెండింగ్‌లో ఉన్న ఆర్టీఐ కేసులను త్వరగా పరిష్కరించాలి

**వేద న్యూస్, వరంగల్ జిల్లా:**

సమాచార హక్కు రక్షణ చట్టం 2005 సొసైటీ సభ్యులు నూతనంగా ఎన్నికైన తెలంగాణ రాష్ట్ర ఆర్టీఐ కమిషనర్లు మొహసీనా పర్వీన్, దేశాల భూపాల్ భోరెడ్డి అయోధ్య రెడ్డిలను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా సమాచార హక్కు రక్షణ చట్టం 2005 రాష్ట్ర ఆర్గనైజర్ అడ్వకేట్ చెట్టబోయిన విద్యాసాగర్ మాట్లాడుతూ



రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఆర్టీఐ కేసులను త్వరగా పరిష్కరించాలని కోరారు. దరఖాస్తు తిరస్కరణపై సెక్షన్ 6(1), పిఐఓలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. సహ చట్టం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు మహమ్మద్ అమీర్ ఖాన్ మాట్లాడుతూ త్వరలో వరంగల్ జిల్లాలో సమాచార హక్కు చట్టంపై కార్యక్రమాలకు ప్రణాళికలు సిద్ధమైనట్లు కావున ఇట్టి అవగాహన కార్యక్రమాలకు ఆర్టీఐ కమిషనర్లు హాజరై సహ చట్టాలపై వివరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆర్టీఐ కమిషనర్లు స్పందిస్తూ రాష్ట్రంలో ఆర్టీఐ చట్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, సామాన్యుడికి ఆర్టీఐ చట్టం ఒక వజ్రాయుధమని, క్షేత్రస్థాయిలో

మిగతా 4వ పేజీలో..



## బాలుడి కిడ్నాప్ కథ సుఖాంతం

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**

నల్గొండ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో 20 నెలల బాలుడిని మంగళవారం కిడ్నాప్ చేసిన సంగతి విధితమే. బాలుడు కిడ్నాప్ ను నల్గొండ పోలీసులు చాకచక్యంగా చేదించి బాలుడిని వారి తల్లిదండ్రులకు అప్పజెప్పడం జరిగింది. నల్గొండ డిఎస్పీ శివరాం రెడ్డి ఆధ్వర్యంలో నాలుగు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు.కిడ్నాప్ అయినా ఏడు గంటల్లోనే చాకచక్యంగా బాలుడిని ఎత్తుకెళ్లిన మహిళలు అరుణ, సుక్కమ్మలను సీసీ ఫుటేజీల ద్వారా గుర్తించి వారి స్వగ్రామమైన గుండాల మండలం పెద్ద పాఠశాల గ్రామంలో కిడ్నాపర్ల ఇంటి వద్ద నుండి బాలుని సురక్షితంగా తీసుకొని వచ్చి తల్లిదండ్రుల వద్దకు చేర్చడం జరిగింది. ఇంటికి వారసుడు లేడనే కారణం తోనే ఎత్తుకెళ్లామని చెబుతున్న మహిళలు.కేసులో కీలకంగా వ్యవహరించిన డిఎస్పి శివరామిరెడ్డి రాఘవరావు పలువురు కానిస్టేబుల్‌ల బృందాన్ని జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్ అభినందించారు.

## ఐఐటి ఆల్ ఇండియా 29 ర్యాంకర్‌కు ఘన సన్మానం



4లో..

# కర్ణాటకలో తాజాగా కుల గణన

**వేద న్యూస్, బెంగళూరు:**



కర్ణాటకలో తాజాగా కులగణన సర్వే నిర్వహించాలని కాంగ్రెస్ నాయకత్వం ఆదేశించినట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ బుధవారం తెలిపారు. కులగణన విషయంలో కొన్ని వర్గాలలో తమను విస్మరించారన్న భావన నెలకొన్న నేపథ్యంలో ఏ వర్గానికి అన్యాయం జరగకుండా చూసుకోవాలని ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు, తనకు పార్టీ హైకమాండ్ సూచించినట్లు శివకుమార్ తెలిపారు. గతంలో నిర్వహించిన కులగణనపై పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులు లేవనెత్తిన వివిధ అంశాలను ప్రస్తావించి ఈ సర్వేలో ఎవరూ విస్మరింపబడని విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని కేంద్రనాయకత్వం కోరింది. గతంలో జరిగిన కుల సర్వేలో తాము పాల్గొనలేకపోయామని భావిస్తున్న ప్రతి ఒక్కరికీ మేము కొత్త గా అవకాశం కల్పిస్తామని డికె శివకుమార్ తెలిపారు. కేబినెట్ సమావేశంలో వివరంగా చర్చించి, ప్రణాళికా బద్ధంగా నిర్వహించడం ద్వారా అందరికీ న్యాయం జరిగేలా చూస్తామని ఆయన తెలిపారు. 2015లో సిద్దరామయ్య ప్రభుత్వంహయాంలో చివరిసరిగా రూపొందించిన విధానాల ప్రకారం నిర్వహించిన కులసర్వం వివాదానికి దారితీసింది. అనేక వర్గాలు ఈ సర్వే ఫలితాలతో విభేధించాయి. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో అధికారికంగా సమర్పించిన డేటా వొక్కలింగ, వీరశైవ -లింగాయత్ వర్గాలు, ఇతర వెనుకబడిన వర్గాల మధ్య విబేధాలను మరింత తీవ్రతరం చేసింది. సామాజికంగా, ఆర్థిక, విద్యా పరమైన వివరాల ఆధారంగా కులాలను పునర్విభజించాలని కూడా ఈ సర్వం సిఫారసు చేసింది. ప్రస్తుతం ఉన్న ఐదు వర్గాలకు బదులు ఆరింటిని సిఫార్సు చేస్తూ, అత్యంత వెనుకబడిన వర్గాలలో కులాలకు క్రిమిలేయర్ విధానం నుంచి మినహాయింపును తొలగించాలని నివేదికలో ప్రతిపాదించారు. సర్వే తీర్మానాలను కాంగ్రెస్ పార్టీలోనే పలు వర్గాలు వ్యతిరేకించాయి. ఒక్కలింగ, లింగాయత్ నాయకులు తమ వర్గాలకు ప్రాతినిధ్యం తగ్గిందని వాదించారు.

# కాంగ్రెస్ పార్టీని చీల్చేందుకు మోదీ ప్రభుత్వం కుట్ర పన్నుతోంది: ఖర్గే సంచలన ఆరోపణలు

**వేద న్యూస్, న్యూఢిల్లీ :**



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పార్టీని విడగొట్టేందుకు మోదీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని, ఇందుకోసం అన్ని రకాలుగా ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. ప్రధాని మోదీ పదకొండేళ్ల పాలనలో దేశ యువతను తప్పుదోవ పట్టించారని, అనేక తప్పులు చేశారని దుయ్యబట్టారు. వాల్మీకి కార్పొరేషన్ కుంభకోణం ఆరోపణలకు సంబంధించి ముగ్గురు కాంగ్రెస్ ఎంపీల ఇళ్లపై ఈడీ దాడులు చేయడంపై ఆయన కర్ణాటకలోని కల్బురిగి జిల్లాలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తీవ్రంగా స్పందించారు. "కాంగ్రెస్ పార్టీని బలహీనపరిచేందుకే మోదీ ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడుతోంది. మా ఎంపీలపై ఆరోపణలు మోపి, దాడులు చేయిస్తున్నారు. అయితే, కాంగ్రెస్ పార్టీలో ఎలాంటి చీలిక రాదు, మేమంతా ఐక్యంగా ఉన్నాం" అని ఖర్గే స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనపై ఖర్గే తీవ్ర విమర్శలు గుప్పించారు. "మోదీ పదకొండేళ్ల పాలనలో ఎన్నో తప్పులు జరిగాయి. లెక్కలేనన్ని అబద్ధాలు చెప్పి దేశ యువతను మోసం చేశారు. ఈ సుదీర్ఘ కాలంలో ఆయన ప్రభుత్వం ఏకంగా 33 తప్పులు చేసింది. నా రాజకీయ జీవితంలో ఇలా అబద్ధాలు చెప్పి, యువతను, పేదలను మోసగించి ఓట్లు దండుకునే ప్రధానమంత్రిని ఎప్పుడూ చూడలేదు. ఇప్పుడు మోదీ రూపంలో చూస్తున్నాను. ఆయనకు ప్రజల బాగోగుల గురించి ఏమాత్రం పట్టదు" అని ఖర్గే ఆరోపించారు.

# తగ్గిన జననాల రేటు

## జననాలకు తగ్గుదల రీప్లేస్‌మెంట్ రేటు 2.1కంటే ఇది చాలా

**వేద న్యూస్, న్యూఢిల్లీ :**

2025 నాటికి భారత జనాభా 1.46 బిలియన్లకు చేరుతుందని అంచనా. ప్రపంచంలోనే అత్యధిక జనాభా గల దేశంగా భారతదేశం కొనసాగుతుందని ఐక్యరాజ్యసమితి జనాభా నివేదిక వెల్లడించింది. అయితే భారతదేశంలో మొత్తం సంతానోత్పత్తిరేటు ప్రామాణిక రేటు కంటే తక్కువగా ఉందని ఈ నివేదిక పేర్కొంది. యునైటెడ్ నేషన్స్ పాపులేషన్ ఫండ్ (యుఎన్ఎఫ్ పిఎ) విడుదల చేసిన 2025 ప్రపంచ జనాభా స్థితి నివేదిక లో ద రియల్ ఫెర్టిలిటీ క్రైసిస్ వివరణలో సంతానోత్పత్తి తగ్గడం వల్ల కలిగే భయాందోళనలను విస్మరించి, పునరుత్పత్తి లక్ష్యాలు సాధించడంపై దృష్టి పెట్టాలని పిలుపునిచ్చింది. జనాభా తగ్గడమో, అధిక జనాభాలో నిజమైన సంక్షోభం కాదని పేర్కొన్నారు. నిజమైన లోపం పునరుత్పత్తి యంత్రాంగం లో ఉంది. సెక్స్ పట్ల విముఖత, గర్భనిరోధకం విషయంలో స్పష్టమైన ఆలోచన లేకపోవడం, వివాహం, సంసారం ప్రారంభించడం పై గలస్వేచ్ఛ వ్యక్తిగతంగా తీసుకునే నిర్ణయాల విషయంలో వారి సామర్థ్యాలు పునరుత్పత్తి కి అవరోధంగా పరిణమిస్తున్నాయని నివేదిక పేర్కొంది. జనాభా పెరుగుదల రేటు, సంతానోత్పత్తి, ఆయుర్దాయం, ఎంతకాలం జీవిస్తామనే విషయంలో వచ్చిన కీలకమైన మార్పులను కూడా ఈ నివేదిక సూచిస్తున్నది. భారతదేశ మొత్తం సంతానోత్పత్తి రేటు ప్రతిమహిళకు 1.9 జననాలకు తగ్గిందని, ఇది భర్తీ స్థాయి రేటు (రీప్లేస్ మెంట్ రేట్)కంటే తక్కువగా ఉందని నివేదిక వెల్లడించింది. అంటే సగటున భారతీయ మహిళలు ఒక తరం నుంచి, మరో తరానికి అందించే జనాభా సంఖ్యను తగ్గించడానికి మొగ్గు చూపుతున్నారు. అంటే అవసరమైన దానికంటే తక్కువ పిల్లలను కలిగి ఉన్నారని ఈ నివేదికలో అభిప్రాయపడ్డారు. భారతదేశంలో జననాల రేటు మందగించినప్పటికీ, దేశ యువజనాభా గణనీయంగా ఉంది. 0-14 మధ్య వయస్సు ఉన్నవారు 24 శాతం,10-19 ఏళ్ల మధ్య వయస్సు ఉన్నవారు 17 శాతం 10-24 ఏళ్ల సంవత్సరాల మధ్య ఉన్న యువత 26 శాతం ఉన్నారు. దేశంలోని 68 శాతం జనాభా పనిచేసే వయస్సు అంటే 15-64 సంవత్సరాల మధ్య వయస్సు గలవారే. పూర్తి స్థాయిలో ఉపాధి, విధానపరమైన నిర్ణయాలద్వారా మద్దతు లభిస్తే లాభదాయకంగా జనాభాను అందించే సూచనలు ఉన్నాయి. ఐక్యరాజ్యసమితి అంచనాల ప్రకారం భారతదేశ జనాభా ప్రస్తుతం 1,463.90 మిలియన్లుగా ఉంది. భారతదేశం ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశం. దాదాపు 15 బిలియన్ల జనాభాతో కొనసాగి, - దాదాపు 40 సంవత్సరాల తర్వాత తగ్గుదల ప్రారంభమయ్యే ముందు ఈ సంఖ్య 17 బిలియన్లకు పెరుగుతుందని ఐక్యరాజ్యసమితి అంచనా వేసినట్లు నివేదిక పేర్కొంది. 1960లో భారతదేశ జనాభా 43 కోట్ల 60 లక్షలు. అప్పట్లో సగటున స్త్రీకి దాదాపు ఆరుగురు పిల్లలు ఉన్నారు. అప్పటిలో నలుగురిలో ఒకరి కంటే తక్కువ మంది ఏదో ఒకరకమైన గర్భ నిరోధక పద్ధతులను అనుసరించేవారు.గత కొనని దశాబ్దాలలో మహిళలలో విద్య పెరిగింది. ఆరోగ్య సంరక్షణ, పునరుత్పత్తి విషయాలలో



ఆలోచనా ధోరణి మారింది. దీంతో తన జీవితాలను ప్రభావితం చేసే నిర్ణయాలలో మహిళల మాట చెల్లుబాటు పెరిగింది. ప్రస్తుతం భారతదేశంలో సగటు స్త్రీకి ఇప్పుడు ఇద్దరే పిల్లలు ఉన్నారు. ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం భారతదేశంలో జనాభా వేగవంతంగా పెరగడానికి ప్రధాన కారణం మధ్య ఆదాయ సమూహాలు. దీంతో జనాభా రెట్టింపు సమయం 79 సంవత్సరాలుగా అంచనావేశారు. భారతదేశం సంతానోత్పత్తి రేటు తగ్గించడంలో గణనీయమైన పురోగతి సాధించింది. 1970లో ఓ కుటుంబంలో దాదాపు ఐదుగురు పిల్లలు ఉంటే,ఇప్పుడు ఇద్దరుగా ఉన్నారు. మెరుగైన విద్య, పునరుత్పత్తి ఆరోగ్య సంరక్షణలో సాధించిన పురోభివృద్ధి ఇందుకు కారణమని ఐక్యరాజ్యసమితి పాపులేషన్ ఫండ్ సంస్థ భారతీయ ప్రతినిధి అంట్రియా ఎం. వోజ్నర్ అన్నారు.


# దేశంలో నిరుపేదలు ఎందరు?

**వేద న్యూస్, న్యూఢిల్లీ :**

దేశంలో అత్యంత పేదరికంతో బాధపడుతున్న వారి సంఖ్య బాగా తగ్గిపోయిందని ప్రపంచబ్యాంక్ ఇటీవల అంచనా వేసిన విషయం తెలిసిందే. బ్యాంక్ అంచనా ప్రకారం దేశంలో 2011-12లో 34.4 కోట్ల మంది నిరుపేదలు ఉండగా 2022-23 నాటికి వారి సంఖ్య 7.5 కోట్లకు తగ్గింది. అంటే 11 సంవత్సరాల వ్యవధిలో 26.9 కోట్ల మంది అత్యంత దారిద్ర్య పరిస్థితి నుండి బయటపడ్డారన్న మాట. 2021లో తాజా పరచిన నిర్వచనం ప్రకారం రోజుకు మూడు డాలర్లు, అంతకంటే తక్కువ ఆదాయం కలిగిన వారిని అత్యంత నిరుపేదలుగా పరిగణిస్తారు. ఈ స్వల్ప ఆదాయంతో ఆహారం, తాగునీరు, ఆవాసం, ప్రాథమిక ఆరోగ్య రక్షణ వంటి మౌలిక అవసరాలు తీర్చుకోవడం కష్టమని ప్రపంచబ్యాంక్ చెబుతోంది. ఈ లెక్కన దేశ జనాభాలో 5.3 శాతం మంది అత్యంత నిరుపేదలేనని అర్థమవుతోంది.

అయితే మన దేశంలో జనగణన చివరిసారిగా 2011లో జరిగింది. కాబట్టి ఇప్పుడు జనాభాలో నిరుపేదలు ఏ మేరకు ఉన్నారో చెప్పడం కష్టం. కానీ ఈ విషయంలో కొన్ని హేతుబద్ధమైన అంచనాలు ఉన్నాయి. ప్రపంచంలో 83.8 కోట్ల మంది నిరుపేదలు ఉన్నారని ఓ అంచనా. వీరిలో 7.7 కోట్ల మంది మన దేశంలోనే ఉన్నారని ప్రపంచబ్యాంక్ అంటోంది. అంటే ప్రపంచ నిరుపేదలలో 9 శాతం మంది మన దేశంలోనే ఉన్నారన్న మాట. ఇది ప్రపంచ సగటు కంటే ఎక్కువే. సంఖ్యాపరంగా చూస్తే నైజీరియా తర్వాత మన దేశంలోనే అత్యంత నిరుపేదలు ఉన్నారు. యూఎన్‌డీపీ, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ కలిసి బహుమితీయ పేదరిక సూచీ (ఎంపీఐ)ని అభివృద్ధి చేశాయి. సూచీ రూపకల్పనలో ఆరోగ్యం, విద్య, జీవన ప్రమాణాలకు సంబంధించిన పది కొలమానాలను ఉపయోగించారు. వీటిలో శిశు మరణాలు, వంటకు ఉపయోగిస్తున్న ఇంధనం, పారిశుధ్యం, తాగునీరు వంటి ప్రత్యేక సూచికలు కూడా ఉన్నాయి. నీతి ఆయోగ్ వీటితో పాటు మరో రెండు సూచికలను తల్లుల ఆరోగ్యం, బ్యాంక్ ఖాతా%ౌ%కలిపి మొత్తం 12 సూచికలను ఉపయోగించి ఎంపీఐని లెక్కిస్తోంది. నీతి ఆయోగ్ పరిశోధన ప్రకారం 2013-14లో భారత ఎంపీఐ 29 శాతం ఉండగా 2022-23 నాటికి 11.3 శాతానికి తగ్గిపోయింది. ఓ విశ్లేషణ ప్రకారం సుమారు 24.8 కోట్ల మంది ప్రజలు ఎంపీఐ పేదరికం నుండి బయటపడ్డారు. పది కొలమానాలతో యూఎన్‌డీపీ రూపొందించిన ఎంపీఐ ప్రకారం 2019-21లో మన ఎంపీఐ పేదరిక రేటు 15 శాతంగా ఉంది. అంటే నీతి ఆయోగ్ చెప్పిన దాని కంటే నాలుగు శాతం ఎక్కువన్న మాట. యూఎన్‌డీపీ హెడ్‌కౌంట్ దామాషా ప్రకారం మన ప్రపంచ ర్యాంక్ 109 దేశాలలో 66గా ఉంది. అత్యంత నిరుపేదలపై ప్రపంచబ్యాంక్ విడుదల చేసిన తాజా డేటాలో ప్రపంచ ర్యాంక్ లేదు.


# హనీమూన్‌లో భర్త హత్య: భార్య సోనమ్ సహా ఐదుగురికి 8 రోజుల పోలీస్ కస్టడీ



**వేద న్యూస్, డెస్క్:**

మేఘాలయలో హనీమూన్ సందర్భంగా తన భర్త రాజా రఘువంశీని హత్య చేసిందన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న సోనమ్ రఘువంశీని, ఆమెకు సహకరించిన మరో నలుగురిని షిల్లాంగ్‌లోని కోర్టు బుధవారం ఎనిమిది రోజుల పోలీస్ కస్టడీకి అప్పగించింది. ఈ కేసుకు సంబంధించి సోనమ్‌ను మంగళవారం అర్ధరాత్రి షిల్లాంగ్‌కు తీసుకురాగా, మిగిలిన నిందితులను బుధవారం ట్రాన్సిట్ రిమాండ్‌పై ఇక్కడికి తరలించినట్లు ఒక సీనియర్ పోలీసు అధికారి వెల్లడించారు. తూర్పు ఖాసీ హిల్స్ జిల్లా ఎస్పీ వివేక్ సయీమ్ మాట్లాడుతూ, "నిందితులందరినీ పది రోజుల కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోరారు. అయితే, కోర్టు ఎనిమిది రోజుల పోలీస్ కస్టడీని మంజూరు చేసింది" అని తెలిపారు. 24 ఏళ్ల సోనమ్‌ను ఉత్తరప్రదేశ్‌లోని ఘాజీపూర్‌లో అరెస్ట్ చేయగా, రాజా రఘువంశీ హత్యకు కుట్ర పన్నడం, అమలు చేయడంలో పాత్ర ఉందన్న ఆరోపణలపై మరో నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ హత్య కేసు దర్యాప్తు కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్), సోహ్రాలోని ఘటనా స్థలంలో క్రైమ్ సీన్ రీకన్‌స్ట్రక్షన్ నిమిత్తం నిందితులను పోలీస్ కస్టడీకి కోరినట్లు సదరు అధికారి వివరించారు.

# యశోద ఆస్పత్రిలో పల్లా రాజేశ్వర్ రెడ్డి.. పరామర్శించిన కేసీఆర్, కవిత



**వేద న్యూస్, డెస్క్:**

బీఆర్ఎస్ సీనియర్ నేత, శాసనసభ్యులు పల్లా రాజేశ్వర్ రెడ్డి బుధవారం ఉదయం స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో కాలు జారి కింద పడటంతో ఆయనకు గాయాలయ్యాయి. ప్రస్తుతం ఆయన హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆయన్ను పరామర్శించారు. బుధవారం బీఆర్‌కే భవన్‌లో కాళేశ్వరం ప్రాజెక్టుపై ఏర్పాటు చేసిన జ్యుడీషియల్ కమిషన్ విచారణకు కేసీఆర్ హాజరయ్యారు. విచారణ ముగిసిన వెంటనే ఆయన నేరుగా యశోద ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ చికిత్స పొందుతున్న పల్లా రాజేశ్వర్ రెడ్డిని పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కేసీఆర్ వెంట బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీష్ రావు తదితరులు ఉన్నారు. పల్లా త్వరగా కోలుకోవాలని కేసీఆర్ ఆకాంక్షించారు. కేసీఆర్‌తో పాటు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కూడా యశోద ఆస్పత్రికి వెళ్లి పల్లా రాజేశ్వర్ రెడ్డిని పరామర్శించారు.

# కిషన్ రెడ్డిపై రేవంత్ రెడ్డి విమర్శలు.. స్పందించిన రాజాసింగ్

**వేద న్యూస్, డెస్క్:**

తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన ప్రాజెక్టులను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అడ్డుకుంటున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలు రాజకీయంగా దుమారం రేపుతున్నాయి. ఈ వ్యాఖ్యలపై గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ స్పందించారు. రాజాసింగ్ మాట్లాడుతూ, "రాష్ట్రంలో ఉన్నప్పుడు ఏమీ మాట్లాడకుండా, ఢిల్లీ వెళ్లిన తర్వాత కిషన్ రెడ్డిపై రేవంత్ రెడ్డి మండిపడతారు" అని అన్నారు. కొన్ని రోజుల క్రితం కిషన్ రెడ్డి, రేవంత్ రెడ్డి ఒకే సభా కార్యక్రమంలో పాల్గొన్నారని గుర్తు చేస్తూ, "అప్పుడు కిషన్ రెడ్డిని కలిసినప్పుడు రేవంత్ రెడ్డి ఈ విషయంపై ఎందుకు అడగలేదు?" అని నిలదీశారు. ఒకవేళ కిషన్ రెడ్డి నిజంగానే రాష్ట్రానికి అన్యాయం చేస్తుంటే, ఆ విషయాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దృష్టికి తీసుకెళ్లి ఫిర్యాదు చేయవచ్చు కదా అని కూడా ఆయన సూచించారు.

# సంపాదకీయం

## సాగు ఇక ముందుకు సాగేనా?

ప్రపంచంలో సాగు విఫలించడం చేత ఏర్పడే ఆహార కొరత వల్ల సంభవించే కరువుల గురించి బైబిల్ వృత్తాంతాలు, భారతీయ సాహిత్యం, పురాతన గ్రంథాల్లో మనం వింటున్నాం. వీటిని ప్రాచీన ప్రజలు దైవిక శిక్షలుగా, పాప పరిణామాలుగా పరిగణించేవాళ్లు. ఇవి అప్పటి పౌరసమాజం జీవన విధానాన్ని ప్రభావితం చేసేవి. ఆధునిక ప్రపంచంలో కరువులకు అనేక కారణాలున్నాయి. అందులో ప్రధానంగా రాజకీయ ఉద్రిక్తతలు, ప్రకృతి వైపరీత్యలు, ఆర్థిక అసమానతలు, వనరుల కోసం పోటీ లాంటివి కీలక విషయాలు. కాగా, వీటికి మించి, అంతర్రాష్ట్ర విచ్ఛిన్నాలు, చట్టపాలన లేకపోవడం, ఉగ్రవాద గ్రూపులు విస్తృతంగా పెరగడంతో యుద్ధాలు, సాయుధ పోరాటాలు కరువులకు దారితీస్తున్నాయి. అయితే, ఆధునిక ప్రపంచంలో యుద్ధాలు, సాయుధ పోరాటాల స్వభావం గణనీయంగా మారిపోయింది. సాంకేతిక పురోగతి వల్ల ప్రాణాంతక ఆయుధాలు, సైబర్ దాడులు, డ్రోన్ లాంటి ఆయుధీకరణతోపాటు జీవాయుధాలు వినియోగంతో యుద్ధాల లక్ష్యాలు మారిపోయాయి. బయోటెర్రరిజంతో మానవులు, పశువులు, పంటలకు హాని కలిగించడానికి లేదా చంపడానికి ఉపయోగించే విషపూరిత పదార్థాలు లేదా వ్యాధులు వ్యాప్తి చేసి దేశ ఆర్థిక పరిస్థితులను దెబ్బతీసి దేశాన్ని కరువులోకి నెట్టే ప్రమాదం ఉంది. వ్యవసాయాన్ని నాశనం చేయడానికి జీవసంబంధమైన ఏజెంట్లను ఉద్దేశపూర్వకంగా ఉపయోగించడాన్ని 'ఆగ్రో టెర్రరిజం/ వ్యవసాయ ఉగ్రవాదం' అని పిలుస్తారు. ఇటీవల ఒక చైనా పరిశోధకుడు ప్రమాదకరమైన పంటలను నాశనం చేసే శిలీంధ్రాన్ని అమెరికాలోకి అక్రమంగా రవాణా చేసేందుకు ప్రయత్నస్తుండగా పట్టుబడంతో వ్యవసాయ-ఉగ్రవాదం మళ్లీ చర్చనీయాంశంగా మారింది. ప్రపంచ వ్యాప్తంగా ఉగ్రవాదం, ఆర్థిక పోటీ మారుతున్న నేపథ్యంలో వ్యవసాయంపై దాడులు పెరిగే ప్రమాదం ఉంది. దేశంలో సాగు చేస్తున్న పంటలను లక్ష్యంగా చేసుకొని పంటలను తీవ్ర నష్టానికి గురి చేయడానికి దీనిని ఉపయోగించవచ్చు. వ్యవసాయ ఉగ్రవాదంతో వ్యవసాయ రంగంపై ప్రత్యక్ష లేదా పరోక్షంగా దాడుల చేసి దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడానికి పన్నాగాలు పడే అవకాశం ఉంది. ఆగ్రో టెర్రరిజం అన్నది ప్రపంచంలో కొత్త కాదు పురాతన కాలం నుండి అంటు సూక్ష్మజీవులు లేదా జీవసంబంధమైన విష పదార్థాలను యుద్ధంల్లో ఉపయోగిచారు. 660 బిసి, అస్సిరియన్లు శత్రువుల నీటి వనరులను కలుషితం చేయడానికి రై ఎర్గోట్ (క్లావిసెప్స్ పర్పురియా) కలిగిన మైకోటాక్సిన్‌ను ఉపయోగించారు. 20వ శతాబ్దంలో, మొదటి ప్రపంచ యుద్ధం సమయంలో జర్మన్లు శత్రువుల గుర్రాలకు హాని కలిగించేందుకు గ్లాండర్‌లను (బురో?ల్డెరియా మల్లె), ఆంత్రాక్స్ (బాసిల్లస్ ఆంత్రాసిస్), ఆహార ధాన్యపు పంటలపై శిలీంధ్రాలను ఉపయోగించారని ఆరోపణలున్నాయి. రెండవ ప్రపంచా యుద్ధ సమయంలో మొదట్లో జపాన్‌లో వరి పంటను నాశనం చేయాలని అమెరికా ప్రణాళిక వేసిందని, కానీ తరువాత జపాన్‌ను లొంగిపోయేలా అణుబాంబును ఉపయోగించాలని నిర్ణయించుకుంది ఆరోపణలున్నాయి. వ్యవసాయమే జీవనాధారంగా ఉన్న మన దేశంలో సుమారుగా 156.06 మిలియన్ హెక్టార్ల వ్యవసాయ యోగ్యమైన భూమితో ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద వ్యవసాయ యోగ్యమైన భూమిని కలిగి ఉంది. దేశవ్యాప్తంగా మొత్తం పంట విస్తీర్ణం 219.16 మిలియన్ హెక్టార్ల (2022) కాగా, 2023-24లో దేశంలో మొత్తం ఆహార ధాన్యాల ఉత్పత్తి 3322.98 లక్షల మెట్రిక్ టన్నులు. 2024- 25 ఆర్థిక సర్వే ప్రకారం, దేశ జనాభాలో సుమారుగా 45.8 శాతం ప్రజలు వ్యవసాయ రంగంమీద ఆధారపడి జీవనోపాధి కొనసాగిస్తున్నారు. అందువల్ల దేశ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయ రంగం వెన్నెముకగా నిలుస్తుంది. ఈ విధంగా సస్యశ్యామలంగా సాగుతున్న దేశ వ్యవసాయ రంగా అభివృద్ధికి అగ్రి టెర్రరిజం అనేది గొడ్డలి పెట్టువంటిది.

మానవ ఆరోగ్యానికి హాని కల్గించే బయోవార్ కంటే వ్యవసాయ ఉగ్రవాదం అమలు చేయడానికి చాలా సులభం. ఎందుకంటే శత్రువుల లక్షాలైనా వ్యవసాయ భూములు విస్తీర్ణంలో చాలా పెద్దవిగా, పేలవమైన నిఘా కలిగి ఉంటాయి. మన దేశంలో కేవలం వరి, గోధుమలు కలిపి దాదాపుగా 80 మిలియన్ల హెక్టర్లలో (2022 -23) పండిస్తున్నారు. ఈ విధంగా ఏక పంటల సంస్కృతి ఉన్న దేశంలో వ్యవసాయ ఉగ్రవాద కార్యకలాపాలకు మరింత సులభతరమవుతుంది. అంతేకాకుండా, పంటల్లో ఒకసారి స్థాపించబడిన వ్యాధి కారకాలు/ తెగుళ్లు నిర్మూలించడం కష్టం. ఫలితంగా వరుస పంటలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. అదే విధంగా, భారతదేశం 15,106.7 కి.మీ భూ సరిహద్దును, ద్వీపభూభాగాలతో సహా 7,516.6 కి.మీ తీరప్రాంతాన్ని కలిగి వుండడం వల్ల వ్యవసాయ ఉగ్రవాదానికి పాల్పడడానికి మరింత సులభమవుతుంది. ఈ తరుణంలో దేశ వ్యవసాయ రంగాన్ని శత్రువు మూకల దాడులను నుండి కాపాడి దేశప్రజలకు సరిపడా ఆహార భద్రతా కల్పించడానికి సరైన జీవభద్రతా చాలా అవసరం. మన దేశంలో జీవభద్రతను కాపాడుకోవడానికి భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐసిఎఆర్), రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాలు (ఎస్ఎయుఎస్), రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల వ్యవసాయ విభాగాలు, ప్రభుత్వేతర సంస్థలు (ఎన్‌జిఓఎస్), గుర్తింపు పొందిన ప్రైవేట్ సిబ్బంది మొదలైన అంతర్ -ప్రభుత్వ సంస్థల చేత అతిపెద్ద మొక్కల సంరక్షణ నెట్‌వర్క్‌ను కలిగి ఉంది. డైరెక్టరేట్ ఆఫ్ ప్లాంట్ ప్రొటెక్షన్, క్వారంటైన్, స్టోరేజ్ (డిపిపిక్యూ ఎస్) అనేది భారతదేశ జాతీయ మొక్కల రక్షణ సంస్థ (ఎన్‌పిపిఒ), డిపిపిక్యూ ఎస్ ద్వారా దేశంలో సురక్షితమైన వాణిజ్యాన్ని ప్రోత్సహించడానికి, ఫైటోసానిటరీ తనిఖీ, చికిత్స, ధ్రువీకరణ మొదలైన వ్యవసాయ వస్తువుల ఎగుమతికి సంబంధించిన అన్ని ఫైటోసానిటరీ బాధ్యతలను ఇది చేపడుతుంది. అదే విధంగా, దేశంలో 'విధ్వంసక కీటకాలు తెగుళ్ల చట్టం- 1914 ద్వారా పంటలకు విధ్వంసం కలిగించే లేదా హాని కలిగించే కీటకాలు, శిలీంధ్రాలు లేదా ఇతర తెగులు ప్రవేశించకుండా నిరోధించడం. అంతేకాకుండా భారతదేశం ఎఫ్ఎఒ అంతర్జాతీయ మొక్కల రక్షణ సమావేశం (ఐపిపిసి)లో సంతకం చేసిన సభ్యదేశం. అందుకనుగుణంగా, ప్లాంట్ క్వారంటైన్ (భారతదేశంలోకి దిగుమతి నియంత్రణ) ఆర్డర్, 2003 ప్రకారం ద్వారా దేశం మొత్తం మీద 46 ఓడరేవులు, 24 విమానాశ్రయాలు, 24 ల్యాండ్ కస్టమ్ స్టేషన్లు సహా మొత్తం 94 ఎంట్రీ పాయింట్లతోపాటు, 77 ఇన్‌ల్యాండ్ కంటైనర్ డిపో/ కంటైనర్ ఫ్రైట్ స్టేషన్లు, 11 విదేశీ పోస్టాఫీసుల్లో మొక్కలు/ మొక్కల పదార్థాల ప్రవేశానికి నోటిఫై చేయబడ్డాయి. వీటి ద్వారా దేశంలోకి ఎగుమతి, దిగుమతి చేయబడుతున్న వ్యవసాయ ఉత్పత్తుల ఫైటోసానిటరీ సర్టిఫికేషన్ కూడా అంతర్జాతీయ మొక్కల రక్షణ సమావేశం (ఐపిపిసి)-1951 ప్రకారం చేపడుతున్నారు. అంతర్జాతీయ స్థాయిలో జీవసంబంధమైన ఆయుధాలను నియంత్రించడానికి బయోలాజికల్ వెపన్స్ కన్వెన్షన్ (బిడబ్లుసి) -1972 ఏర్పాటు చేయ్యబడింది. బయోలాజికల్ వెపన్స్ కన్వెన్షన్ ప్రకారం సభ్యదేశాలు జీవాయుధాలను అభివృద్ధికి, ఉత్పత్తికి, నిల్వచేయడానికి, సంపాదించడానికి లేదా వాడకాన్ని సమర్థవంతంగా నిషేధిస్తుంది.

# బాల్యాన్ని ఇటుక బట్టీల్లో కాల్చవద్దు !

**వేద న్యూస్, డెస్క్:**

అంతర్జాతీయ కార్మిక సంస్థ నిర్వచనం ప్రకారం, బాలల్ని ఉపాధులు లేదా ఉద్యోగాల ఉచ్చులో బంధించి వారి బాల్యాన్ని, శక్తియుక్తులను, గౌరవాన్ని, సంపూర్ణ ఎదుగుదలను, శారీరక మానసిక ఆరోగ్యాన్ని హరింపజేసే లేదా నలిపి వేసే ప్రయత్నాలను బాల కార్మిక వ్యవస్థ అని అంటాం. అంతర్జాతీయ, జాతీయ చట్టాలు, నియమనిబంధనలకు వ్యతిరేకంగా పిల్లలను (5 నుంచి 17 ఏండ్ల లోపు) కార్మికులుగా మార్చి వారి బంగారు భవితను బుగ్గిపాలు చేయడాన్ని బాల కార్మిక దురాచారం అని అర్థం చేసుకోవాలి. ప్రపంచవ్యాప్తంగా నేటికీ 160 మిలియన్ల బాల కార్మికుల బతుకులు ఉపాధుల పేరుతో బుగ్గిపాలు అవుతున్నాయి. వీరిలో వయస్సు 5 - 11 ఏండ్ల లోపు ఉన్న బాలలు 48 శాతం, 12 - 14 ఏండ్ల వారు 28 శాతం, 15 - 17 ఏండ్ల లోపు పిల్లలు 24 శాతం ఉండడం గమనించారు. ఆఫ్రికాలో 20 శాతం బాలలు, ఏసియా పసిఫిక్‌లో 7 శాతం, అమెరికన్లు 11 శాతం, యూరోప్-సెంట్రల్ ఆసియాలో 4 శాతం, అరబ్ ప్రాంతాల్లో 3 శాతం బాల కార్మికులు నమోదు అవుతున్నారు. ప్రపంచ బాల కార్మికుల్లో దాదాపు 56 శాతం మధ్య ఆదాయ దేశాల్లోనే ఉండడం ఆశ్చర్యంగా ఉన్నది. బాల కార్మిక వ్యవస్థను రూపు మాపడంలో భారత్ కొంత ప్రగతిని సాధించినప్పటికీ మరింత దృష్టిని కేంద్రీకరించవలసిన అవసరం ఏర్పడుతున్నది. 2011 వివరాల ప్రకారం, 5 - 14 ఏండ్ల లోపు బాల కార్మికులు 43.53 లక్షల ఉన్నారని, 2001లో వీరి సంఖ్య 1.26 కోట్లు ఉండేదని గమనించాలి. పేదరికం, నిరక్షరాస్యత, సామాజిక-ఆర్థిక సమస్యలతో బాల కార్మిక వ్యవస్థ ప్రధానంగా ముడిపడి ఉంటుంది. భారత బాల కార్మికులు అధికంగా వ్యవసాయం, నిర్మాణ రంగం, ఇటుక బట్టీలు, బాణసంచా తయారీ కేంద్రాలు, కార్పెట్ పరిశ్రమ, మైనింగ్, రెస్టారెంట్లు లాంటి రంగాల్లో మగ్గుతున్నారు. భారత రాజ్యాంగం ప్రకారం 14 ఏండ్ల లోపు పిల్లలను చట్టవ్యతిరేకంగా పనిలో పెట్టుకోవడం లేదా ప్రమాదకర పరిస్థితుల్లో బతుకులను గడపడం చట్టవ్యతిరేకమని తెలుపుతున్నది. బాల కార్మిక దురాచారాన్ని రూపుమాపడానికి



1986 బాల కార్మిక చట్టం, 2017 బాల కార్మిక చట్ట సవరణ, 1987లో బాల కార్మికుల జాతీయ పాలసీ లాంటివని తేవడం, అమలు పరచడం జరుగుతున్నది.

ఐరాస-అంతర్జాతీయ కార్మిక సంస్థ(ఐఎల్‌ఓ)-యూనిసెఫ్‌ల చొరవతో ప్రతి ఏట 12 జూన్‌న "ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినం ( వరల్డ్ డే అగెనిస్ట్ చైల్డ్ లేబర్)"ను పాటించడం ఆనవాయితీగా మారింది. ఈ వేదికగా బాల కార్మిక దురాచారాన్ని కట్టడి చేయడం, అవగాహన కల్పించడం, కఠినంగా చట్టాలు అమలు చేయడం, బాలలకు/కుటుంబాలకు సరైన సహాయాలు అందించడం లాంటివి జరుగుతున్నాయి. 2025 ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినం ఇతివృత్తంగా "ప్రగతి స్పష్టమే కాని ఇంకా చేయాల్సింది ఉంది : బాలకార్మిక దురాచార నిర్మూలన వేగం పెంచుదాం" అనబడే అంశాన్ని తీసుకున్నారు. బాలలు చదువుకోవడం, ఆడు కోవడం, సురక్షిత బాల్యం కొనసాగడానికి మాత్రమే అవకాశం కల్పించాలని కుటుంబ పెద్దలు తెలుసుకోవాలి. పిల్లల శ్రమను దోపిడీ చేయడం, చిన్నారి చేతులకు/దేహానికి/మనస్సుకు గాయాలు చేయడం, బాలల బంగారు భవిష్యత్తును ఆదిలోనే తుంచేయడం అమానవీయం, ఆక్షేపణీయం అని నినదించాలి. బాల కార్మిక దురాచార నిర్మూలనకు సవాళ్లుగా పేదరికం, నిరక్షరాస్యత, తల్లితండ్రుల నిరుద్యోగం, ఆర్థిక ఇబ్బందులు, విద్యకు దూరంగా ఉండడం, సామాజిక కట్టుబాట్లు, చట్టాల అమలులో నిర్లక్ష్యం, సామాజిక అంగీకారం, ప్రలోభ యాజమాన్యాలు, అవగాహన లోపం, పౌర సమాజ నిశ్శబ్దం లాంటివి అడ్డుగా నిలుస్తున్నాయి. బాల కార్మిక వ్యవస్థను రూపుమాపడానికి తీసుకోవలసా చర్యల్లో పేదరిక నిర్మూలన, తల్లితండ్రులకు ఉద్యోగ ఉపాధుల కల్పన, పాఠశాలల అందుబాటు, అక్షరాస్యత/అవగాహన పెంచడం, సామాజిక భద్రత కల్పించడం, ప్రభుత్వాలు/పౌర సమాజం/అంతర్జాతీయ సంస్థల సమైక్య కృషి, విద్యపై పెట్టుబడులు పెంచడం, నైపుణ్యాల వృద్ధి, వయోజనులకు ఉద్యోగ కల్పన లాంటివి నిత్యం కొనసాగాలి. బాలల ఆరోగ్య సంరక్షణ, పిల్లల గౌరవాన్ని కాపాడడం, విద్య అవకాశాలు కల్పన, ఆటపాటల కొనసాగింపుకు గట్టి కృషి జరగాలి. ప్రమాదకర పరిస్థితుల్లో పని చేస్తున్న బాలల మనసులకు పడుతున్న తూట్లు, విరుగుతున్న ఎముకలు, శ్వాస ఇబ్బందులు, శారీరక గాయాలు, విష రసాయనాల దుష్ప్రభావాలు, ఆందోళనలు, మానసిక ఒత్తిడి, భావోద్వేగ సమస్యలు, సామాజిక-శారీరక-మానసిక ఎదుగుదల సమస్యలు, చిన్నారుల శ్రమ దోపిడీ లాంటివి బాల్యాన్ని చిదిమేయడం నేటి డిజిటల్ యుగంలో సహితం జరగడం సోచనీయం. ఇప్పటికైనా బాల కార్మిక దురాచారాన్ని ప్రపంచం నుంచి పాతాళానికి తరిమేద్దాం, బాలలకు పూర్తి స్వేచ్ఛనిద్దాం.


## ఆస్ట్రియా స్కూల్‌లో కాల్పులు 8 మంది మృతి..

**వేద న్యూస్, డెస్క్:**




ఆస్ట్రియాలోని గ్రాజ్ నగరంలో ఒక స్కూల్‌లో విద్యా ర్థి కాల్పులు జరపడం కలకలం రేపింది. ఓ విద్యార్థి జరిపిన కా ల్పులలో 8 మంది చనిపోయారు. తర్వాత కాల్పులు జరిపిన వి ద్యార్థి కూడా వాష్ రూప్ లో ఆత్మహత్య చేసుకుని కన్పించాడని ఆస్ట్రియా మీడియా తెలిపింది. గ్రాజ్ నగరంలోని బోర్గ్ డ్రీ యర్ షుట్టెమ్ గాస్పే స్కూల్ లో ఈ ఘటన జరిగింది. కాల్పుల లో గా యపడిన టీచర్ తో సహా చాలామందిని ఆస్పత్రికి తరలించి చి కిత్స చేస్తున్నామని గ్రాజ్ నగర మేయర్ ఎల్కే కహార్ తెలిపారు. ఇది అత్యంత దారుణమైన విషా దం అని ఆమె అభివర్ణించారు. ఉదయం 10గంటల ప్రాంతంలో పాఠశాలనుంచి కాల్పుల శబ్దాలురావడంతో పోలీసులు రంగంలోకి దిగారు. కాల్పులలో తీవ్రంగా గాయపడిన వారిలో విద్యార్థులు, టీచర్లు కూడా ఉన్నారని వార్తాసంస్థ పేర్కొంది. ఈ ఘటన జరగగానే, స్కూల్ నుంచి విద్యార్థులను పంపివేసి , ఆ ప్రాంతంలో భద్రత పెంచారు. బాధితులకు వైద్యసిబ్బంది చికిత్స అందిస్తున్నారు. బంధువులు వారికి సహకరిస్తున్నారని స్థానికపోలీసు అధికారి తెలిపారు. కాల్పుల సమయంలో విద్యార్థులను రక్షించేందుకు టీచర్లు ప్రయత్నించి వారు గాయపడ్డారు. పదేళ్ల క్రితం, 2015 జూన్ 20న గ్రాజ్ నగరంలో కాల్పులు జరిగాయి. ఆ ఘటనలో ముగ్గురు చనిపోయారు. ఆ తర్వాత స్కూల్ లో కాల్పులు జరగడం ఇదే ప్రథమం.

## మాట నిలబెట్టుకున్న సర్కార్



**వేద న్యూస్, అమరావతి :**

తల్లులకు కూటమి ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా మరో ముఖ్యమైన పథకం అమలుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. తల్లికి వందనం పథకానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్న సందర్భంగా రేపు (గురువారం) తల్లులకు కానుకగా తల్లికి వందనం నిధులు ఇవ్వాలని నిర్ణయించింది. రేపే (జూన్ 12) తల్లికి వందనం నిధులు విడుదల కానున్నాయి. రాష్ట్రంలో మొత్తం 67 లక్షల మందికి తల్లికి వందనం పథకం కింద వారివారి ఖాతాల్లో ప్రభుత్వం నగదు జమ చేయనుంది. ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికీ తల్లికి వందనం ఇస్తామన్న మేనిఫెస్టో హామీ మేరకు పథకం అమలుకు నిర్ణయం తీసుకుంది సర్కార్. తల్లికి వందనం కింద ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున ప్రభుత్వం చెల్లించనుంది. ఈ మేరకు 67,27,164 మంది విద్యార్థులకు ఈ పథకం వర్తించనుంది. తల్లికి వందనం పథకం కింద రేపు తల్లుల ఖాతాల్లో రూ.8,745 కోట్లను కూటమి ప్రభుత్వం జమ చేయనుంది. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే తల్లికి వందనం నిధులు ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఇచ్చిన మాట ప్రకారం ఈరోజు అర్ధరాత్రి నుంచే నిధులు విడుదలకానున్నాయి. 1వ తరగతిలో అడ్మిషన్ పొందే పిల్లలు, ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో చేరే విద్యార్థులకూ తల్లికి వందనం పథకం అమలు కానుంది. అడ్మిషన్లు పూర్తి అయ్యి డేటా అందుబాటులోకి రాగానే ఆ విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నిధులు జమకానున్నాయి. ఈ మేరకు విధి విధానాలను ఖరారు చేస్తూ ఈరోజు అర్ధరాత్రికి ప్రభుత్వం జీవో విడుదల చేయనుంది. సూపర్ సిక్స్ హామీల్లో ఇప్పటికే పింఛన్ల పెంపు, అన్నా క్యాంటీన్, మెగా డీఎస్సీ, దీపం-2 పథకాలను ప్రభుత్వం అమలు చేసిన విషయం తెలిసిందే. ఇక తల్లికి వందనం నిధుల విడుదల చేయాలన్న నిర్ణయంతో ఇచ్చిన మాటను నిలుపుకుంది కూటమి సర్కార్.

## టెర్రరిస్ట్‌లకు పాక్ మద్దతు కొనసాగిస్తే..



**వేద న్యూస్, న్యూఢిల్లీ :**

పాకిస్తాన్ టెర్రరిస్ట్ లకు మద్దతు కొనసాగిస్తే, భారతదేశం పాకిస్తాన్ ను మున్ముందు కూడా లక్ష్యంగా చేసుకుని తీరుతుందని భారత విధేశాంగమంత్రి ఎస్. జైశంకర్ సుస్పష్టం చేశారు. టెర్రరిస్ట్ లు ఎక్కడ ఉన్నారనే విషయంలో మాకు పట్టింపు లేదు. వారు పాకిస్తాన్ లో ఎంత లోపలికి పోతే.. మేము పాకిస్తాన్ లో అంత లోపలికీ పోవడం ఖాయం అని ఆయన అన్నారు. బెల్జియం, ఫ్రాన్స్ లలో వారం రోజుల పర్యటనలో ఉన్న విదేశాంగమంత్రి డాక్టర్ జైశంకర్ పోలిటికో తో మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత వైమానిక దళం జెట్ లకు వాటిల్లిన నష్టంపై ప్రశ్నలకు సమాధానమిస్తూ, విదేశాంగమంత్రి తనకు సంబంధించినంత వరకూ, రాఫెల్ ఎంత ప్రభావంతంగా ఉందా, ఇతర వ్యవస్థలు ఎంత ప్రభావితంగా ఉన్నాయా అన్న అంశంతో సంబంధం లేదని, తనకు గల రుజువులు పాకిస్తాన్ లో ధ్వంసమైన వైమానిక స్థావరాలు, వ్యవస్థలు, దెబ్బతిన్న క్షేత్రాలే నని స్పష్టం చేశారు. జైశంకర్ లె ఫిగరోకు ఇచ్చి ఇంటర్ వ్యూలో టెర్రరిస్ట్ లు భారతదేశంపై దాడి చేస్తే, వారు పాకిస్తాన్ తో సహా ఎక్కడ ఉన్నా వారిని వేటాడతామని, ఈ విషయంలో భారతదేశం స్పష్టమైన దృక్పథంతో ఉన్నదని, సీమాంతర ఉగ్రవాదం కొనసాగుతున్నంత కాలం, భారత్ ప్రతికారదాడులు తప్పబోవని, ప్రతీకారం తీర్చుకుంటూనే ఉంటామని జైశంకర్ వెల్లడించారు. ఆత్మరక్షణ కు అవసరమైన చర్యలు తీసుకుని తీరతాం. అతి ప్రజల పట్ల ప్రభుత్వానికి గల ప్రాథమిక విధి.. అని స్పష్టం చేశారు.

## యువకుడిపై మొసలి దాడి

**వేద న్యూస్, డెస్క్:**

కర్ణాటక రాష్ట్రం కంప్లి తాలుకా పరిధిలోని సన్నాపురం గ్రామంలో మంగళవారం నదిలో స్నానం చేస్తున్న యువకుడిపై మొసలి దాడి చేసింది. యువకుడు కేకలు వేయడంతో మొసలి నదిలోకి పరుగు తీసింది. వేదమూర్తి అనే యువకుడు మధ్యాహ్న సమయంలో స్నానం చేయడానికి గ్రామం పక్కనే ఉన్న తుంగభద్ర నదిలో దిగాడు. స్నానం చేస్తున్న సమయంలో ఒక్కసారి పొదల్లో ఉన్న మొసలి దాడి చేసింది. గ్రామానికి చెందిన వీరేష్ కర్రతో కొట్టడంతో మొసలి నదిలోకి వెళ్లింది. అప్పటికే వేదమూర్తి కాలికి గాయాలయ్యాయి. గమనించిన కుటుంబసభ్యులు మెరుగైన చికిత్స కోసం ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా గ్రామస్థులు నదిలో మొసళ్లు సంచరించే ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని అటవీశాఖ అధికారులకు కోరారు. వేదమూర్తి క్షేమంగా బయటపడటంతో పునర్జన్మ దక్కిందంటూ స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

వేద న్యూస్

గురువారం జూన్ 12, 2025

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం సామాజిక బాధ్యత

■ బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే

**వేద న్యూస్, హన్మకొండ :**

మన చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం సామాజిక బాధ్యత అని బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే అభిప్రాయపడ్డారు. వంద రోజుల కార్యాచరణ ప్రోగ్రాం లో భాగంగా బుధవారం హన్మకొండ పరిధి 58,59 డివిజన్ లలో గల ఇందిరానగర్ ఎన్జీవోస్ కాలనీ భవాని నగర్ ప్రాంతాల్లో నిర్వహించిన కార్యక్రమంలో కమిషనర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన డెసిల్టేషన్ ప్రక్రియ తడి పొడి చెత్తను వేరు చేసి స్వచ్ఛ ఆటో లకు అందించడం సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా దోమలను అరికట్టడానికి చేపట్టే ఆంటీ లార్వా ఆక్టివిటీస్ ట్రేడ్ లైసెన్స్ వసూళ్ల తీరును కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అంతకుముందు నిర్వహించిన అవగాహన ర్యాలీ తో పాటు కరపత్రాల పంపిణీ గృహాలకు స్టికర్ అతికించిన విధానాన్ని కమిషనర్ పరిశీలించి మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రం గా ఉంచాలని సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను విడనాడాలని ప్లాస్టిక్ ను అంతమొందించాలంటే ప్రత్యమ్నాయ అవకాశాల పై దృష్టి సారించి బట్ట సంచులు జూట్ బ్యాగులను వినియోగించాలని స్థానికుల కు సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గుజ్జుల వసంత, ఇమ్మడి లోహిత, రాజు, సిఎం హెచ్ ఓ డా. రాజారెడ్డి, డిఈ సారంగం, సానిటరీ ఇన్స్పెక్టర్ భాషా, నాయక్, హెల్త్ ఇన్స్పెక్టర్ మధుకర్ తదితరులు పాల్గొన్నారు.






## తప్పిపోయిన వృద్ధుడిని కుటుంబ సభ్యులకు అప్పజెప్పిన పోలీసులు

**వేద న్యూస్, మడికొండ :**

మడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న వాల్మీకి నగర్ వద్ద ఒక 70 సంవత్సరాల వయసు గల వృద్ధుడు మంగళవారం నుండి అక్కడే ఉండడం గమనించిన స్థానికులు, స్థానిక పోలీస్ వారికి సమాచారం అందించడంతో వెంటనే పోలీసులు వచ్చి ఆ వృద్ధుడిని అక్కున చేర్చుకొని పోలీస్ స్టేషన్ కు తీసుకొని వెళ్లారన్నారు. స్థానిక ఇన్స్పెక్టర్ కిషన్ వృద్ధుడి వివరాలు అడిగి తెలుసుకుని అతని పేరు ఎండి. హైదర్ సాబ్ ధర్మసాగర్ మండలం, ధర్మపురం గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించామన్నారు. వృద్ధుడు తెలిపిన వివరాల ప్రకారం తన కుమారుడు ధర్మపురంలో ఉంటాడని చెప్పడంతో, అతని వివరాలు కనుగొని అతని కుమారుడు రహిమోద్దీన్‌కు సమాచారం అందించగా అతడు మడికొండ పోలీస్ స్టేషన్‌కు వచ్చాడన్నారు. నిన్న తన తండ్రి జగిత్యాలలో ఉన్న తన చెల్లి వద్దకు వెళ్లి వస్తానని చెప్పి ఇంట్లో నుండి వెళ్లి ఇక్కడకీ వచ్చి తప్పి పోయాడని, అతని గురించి నేను, మా చెల్లి ఇద్దరం వెతుకుతున్నామని చెప్పాడన్నారు. తప్పిపోయిన తండ్రిని అప్పగించినందుకు మడికొండ పోలీస్ ఇన్స్పెక్టర్ కిషన్, ఎస్సై రాజ్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ జయరాజు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.



## ఐఐటి ఆల్ ఇండియా 29 ర్యాంకర్‌కు ఘన సన్మానం

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**

మిర్యాలగూడ పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు బాణవత్ స్కైలాబ్ కుమారుడు బాణవత్ సాయి ఠాగూర్ ఐఐటి ఓపెన్ క్యాటగిరీలో ఆల్ ఇండియా 29వ ర్యాంక్ సాధించిన సందర్భంగా ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్,మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి వారి ఇంటికి వెళ్లి వారిని సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ సాయి ఠాకూర్ సాధించిన ఈ ఘనత మన మిర్యాలగూడ కి మరియు మన గిరిజన (బంజార) జాతికి ఎంతో గర్వకారణం అని ఎంతో మంది యువతకు ఆదర్శం అని అన్నారు. అలాగే అతడి వెన్నంటు ఉండి నడిపించిన వారి కుటుంబ సభ్యులను అభినందించారు. భాణవత్ సాయి ఇంకా ఉన్నత స్థానాలకు చేరాలని వారికి ప్రభుత్వం నుంచి తమ నుంచి ఎల్లప్పుడూ పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు,17,18 వ వార్డు పెద్దలు పాల్గొన్నారు.



## కరీమాబాద్‌లో అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట

**వేద న్యూస్, కరీమాబాద్ :**

గ్రేటర్ వరంగల్ కరీమాబాద్ ప్రాంతంలో బుధవారం రామేశ్వర టెంపుల్ అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో అమ్మ మాట..అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కరీమాబాద్ ప్రాంతంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మాధవి, కరీమాబాద్ ప్రభుత్వ హై స్కూల్ చైర్మన్ అక్తర్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొని ఈ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ మూడేళ్లు పైబడిన చిన్నారులందరిని అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలని సూచించారు.కేంద్రంలో చిన్నారులకు పౌష్టిక ఆహారంతో పాటు, ఆట పాటలతో కూడిన విద్య అందిస్తారని తెలిపారు. చిన్నారులకే కాకుండా, గర్భిణిలు, బాలింతలకు కూడా పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. పిల్లల తల్లిదండ్రులు బాధ్యతగా తమ చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలని కోరారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సహాయం అందజేత

**వేద న్యూస్, గీసుకొండ**


నిన్న రాత్రి అనారోగ్యంతో బాధపడుతూ, శివైక్యం పొందిన మన గీసుకొండ గ్రామానికి చెందిన సీనియర్ సిటిజన్, అయ్యప్ప గురుస్వామి, భజన మండలి హార్మోనియం కళాకారులు, శ్రీ తాటికొండ బ్రహ్మ చారి అంత్యక్రియలకు సహాయార్థం గీసుకొండ గ్రామ శ్రీమంతుడు పెగళ్ళపాటి లక్ష్మీనారాయణ పంపిన రూ. 5వేలు, అమెరికాలో సైంటిస్ట్‌గా పనిచేస్తున్న పసునూటి కళ్యాణ్ పంపిన రూ. 5వేలు ఆర్థికసహాయాన్ని మృతుని కుమారుడైన తాటికొండ రమణ గారికి అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గీసుకొండ సోషల్ సర్వీస్ టీం సభ్యులు కర్ణకంటి రాంమూర్తి, గ్రామ పెద్దలు వీరగొని రాజ్ కుమార్, మాజీ సర్పంచులు దౌడు బాబు, కోల కుమారస్వామి, పొగాకు బిక్షపతి, పుల్లూరి రవి, బండారు వెంకటేశ్వర్లు, వీరాటి సంజీవరెడ్డి,బెజ్జెంకి బిక్షపతి, కర్ణకంటి బ్రహ్మచారి, సత్యనారాయణ, రాజేంద్రాచారి, తాటికొండ దామోదర్, నరేందర్, శంకర్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



## అమ్మ మాట.. అంగన్వాడీ బాట

**వేద న్యూస్, కోరుట్ల ప్రతినిధి :**

మెట్ పల్లి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో గల అంగన్వాడి సెంటర్ కాశిబాగు, ఇందిరా నగర్, ముస్లిం పుర సెంటర్లో మెట్పల్లి ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ మనేమ్మ ఆదేశానుసారం అంగన్వాడి సెంటర్లలో బుధవారం అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమంలో భాగంగా తల్లులు పిల్లలతో కాలనీలలో ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. మూడు సంవత్సరాల నుండి ఐదు సంవత్సరాల పిల్లలను అంగన్వాడి సెంటర్ లకు తీసుకురావాలని తల్లులకు అంగన్వాడి సూపర్వైజర్ ప్రతిభ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంగన్వాడీ అలంకరణ మరియు పిల్లలకు ఎగ్గు బిర్యానీ అంగన్వాడి సెంటర్లో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ ప్రతిభ, అంగన్వాడి టీచర్లు, అనురాధ, విజయలక్ష్మి, సంగీత, తల్లులు పిల్లలు పాల్గొన్నారు.




## అమ్మ మాట.. అంగన్వాడీ బాట

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**



గ్రేటర్ వరంగల్ 33 వ డివిజన్ పెరుకవాడ అంగన్వాడి సెంటర్లో అమ్మ మాట, అంగన్వాడి బాట కార్యక్రమాన్ని సూపర్వైజర్ పెరుమాండ్ల ఆశా దేవి అధ్యక్షుత నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో భాగంగా ఫ్రీ స్కూల్ తల్లిదండ్రులకు పిల్లలు పుష్పాలు అందించి స్వాగతం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 3 నుండి 6 సంవత్సరాల పిల్లలు ఉన్న తల్లిదండ్రులకు అంగన్వాడి సెంటర్ నిర్వహించే కార్యక్రమాల టైంటేబుల్ అలాగే వర్క్ బుక్స్ అసెస్మెంట్ కార్డుల ప్రాముఖ్యత గూర్చి చెప్పడం జరిగిందన్నారు. పూర్వ ప్రాథమిక విద్య పిల్లల సర్వేతో ముఖ అభివృద్ధి ఏ విధంగా ద్రోహత పడుతుందో తెలపడం జరిగిందనీ తెలిపారు. మూడు సంవత్సరాల పిల్లల గృహ సందర్శన చేసి వాళ్ళను అంగన్వాడి కేంద్రంలో నమోదు చేసుకోవడం జరిగిందని ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలను ప్రి స్కూల్ సర్టిఫికెట్ ఇచ్చి గవర్నమెంట్ స్కూల్లో జాయినింగ్ చేసి తల్లిదండ్రులు గర్భిణీలు బాలింతలు అమ్మ మాట అంగన్వాడి ర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ భవాని, గవర్నమెంట్ టీచర్ కళావతి, ఆశా వర్కర్ ప్రమోద, గర్భిణీలు రవళి, రాజేశ్వరి, వరలక్ష్మి, శ్రావణి పాల్గొన్నారు.

## పెంచిన బస్ చార్జీలను వెంటనే తగ్గించాలి

**వేద న్యూస్, హన్మకొండ :**



సామాన్య ప్రజలపై భారాలను మోపే విధంగా పెంచిన ఆర్టీసీ బస్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ప్రజలపై ఎలాంటి భారాలు మోపమని హామీఇచ్చి సామాన్య పేద బడుగు బలహీన వర్గాల ప్రజలు ప్రయాణించే ఆర్టీసీ బస్ చార్జీలు పెంచి భారాలను మోపడమేంటని ఆయన ప్రశ్నించారు. ఆర్టిసి లాభాల బాటలో ఉన్నదని ఒక వైపు చెప్తూనే మరోవైపు బస్సు చార్జీలు పెంచడం సమంజసం కాదన్నారు. కేంద్ర రాష్ట్ర పాలకుల విధానాలతో ఇప్పటికే నిత్యవసర వస్తువుల ధరలు చుక్కలంటి సామాన్య ప్రజలు బాధలు పడుతుంటే బస్ ఛార్జీలు పెంచి ప్రజలనుఇబ్బందులకు గురిచేయడమన్యాయ మన్నారు. విద్యార్థులకు ఉచితంగా బస్ పాసులు ఇవ్వాల్సింది పోయి బస్సు పాసుల చార్జీలు నెలకు రూ.400 నుండి రూ.600కు మూడునెలలకు రూ.1200 నుండి రూ.1800 వరకు పెంచడం లక్షలాది పేద విద్యార్థుల పాలిట శాపంగా మారిందన్నారు. విద్యార్థులకు ఫీజు రీయంబర్సు మెంట్, స్కాలర్షిప్లు మొదలైనవన్నీ పెండింగ్ లో ఉండి ఇప్పటికే వారు ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ పరిస్థితిలో విద్యార్థులకు బస్సు పాస్ రేట్లు పెంచడం మూలిగే నక్కపై తాటి పండు పడ్డ చందంగా ఉందన్నారు. సామాన్య ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆర్థికంగా చాలా సమస్యలను ఎదుర్కోవలసి వస్తుందన్నారు. ప్రజల, విద్యార్థుల ఆందోళనలు ఉధృతం కాకముందే పెంచిన బస్ చార్జీలను ఉపసంహరించాలని, విద్యార్థులకు ఉచితంగా బస్సు పాసులు ఇవ్వాలని వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## వృద్ధులకు రైల్వే టికెట్ సౌకర్యం పునరుద్ధరించాలి

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**



సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ వరంగల్ అధ్యక్షులు కోన్ రెడ్డి మల్లారెడ్డి, సంయుక్త కార్య దర్శి ఆడెపు రాజేంద్ర ప్రసాద్ వరంగల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ కడియం కావ్యని కలసి వయో వృద్ధుల సమస్యల సాధనకు, వారి సౌకర్యాలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకవెళ్ళడానికి వినతి పత్రం అందజేశారు. ఈ నెల 21 జరుగు పార్లమెంటులో గతంలో ఇచ్చిన రైల్వే రూ.40 కన్సిషన్ కోవిడ్సమయంలో రద్దుచేసిన దానిని తిరిగి పునరుద్ధరించాలని, 70 సంవత్సరాల నుండి 60 సంవత్సరంలకు ఆయుష్మాన్భవ వైద్య సదుపాయం కల్పించాలని కోరుతూ మరిన్ని సౌకర్యలను ముఖ్యంగా జైపూర్లో జరిగిన అఖిలభారత సీనియర్ సిటిజెన్ సమావేశంలో తీర్మాణించిన అంశాల కాపీ ని జత పరిచి ఎంపీకి అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఎంపీ సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## అలా చేస్తే ఎంతటి వారినైనా వదలం.. పోలీస్ శాఖ హెచ్చరిక

**వేద న్యూస్, హైదరాబాద్**





చేవెళ్లలోని త్రిపుర రిసార్ట్‌పై పోలీసులు ఆకస్మిక దాడులు చేశారు. ఈ రిసార్ట్‌లో ఫోక్ సింగర్ మంగ్లీ బర్త్‌డే పార్టీ నిర్వహిస్తున్నారు. మంగళవారం అర్ధరాత్రి దాటక కూడా పెద్దఎత్తున డీజే శబ్దాలు రావడంతో స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు రిసార్ట్‌పై ఒక్కసారిగా మెరుపు దాడి చేశారు. ఈ క్రమంలో పార్టీలో పెద్దఎత్తున విదేశీ లిక్కర్ పట్టుబడింది. అంతేకాకుండా గంజాయి సేవిస్తూ ఓ వ్యక్తి పోలీసులకు చిక్కాడు. మంగ్లీ తీరుపై సీరియస్ అయిన పోలీసులు ట్వీట్ వేదికగా కౌంటర్ ఇచ్చారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారిపై అయినా చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేశారు.

### పోలీసుల ట్వీట్

'అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్న రిసార్ట్‌పై చేవెళ్ల పోలీసులు దాడి చేశారు. చట్టాలు పాటించకుండా ఎలా పడితే అలా వ్యతిరేకంగా వ్యవహరిస్తామంటే పోలీసులు ఘులిపించి గాడినపెట్టాల్సి వస్తుంది. ఎంతటి ప్రముఖులైనా డ్రగ్స్ లాంటి వాటిని వాడే వారి పట్ల కఠిన చర్యలు తీసుకోవడానికి వెనుకాడం' అంటూ తెలంగాణ పోలీసు శాఖ ట్వీట్ చేసింది.



## మేయర్‌ను కలిసిన అకౌంట్స్ ఆఫీసర్

**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**

ఇటీవల నూతనంగా బల్దియా అకౌంట్స్ అధికారిగా (ఏఓ)గా బాధ్యతలు చేపట్టిన శివ లింగం బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో నగర మేయర్ గుండు సుధారాణిను మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఖమ్మం నగర పాలక సంస్థలో అకౌంట్స్ అధికారి గా విధులు నిర్వహించి బదిలీపై జీడబ్ల్యూఎంసిలో అకౌంట్స్ అధికారిగా శివలింగం నియమితులయ్యారు.

## పెండింగ్‌లో ఉన్న ఆర్టీఐ కేసులను త్వరగా పరిష్కరించాలి

మొదటి పేజీ తరువాయి

అధికారులు ప్రతి సామాన్యుడికి జవాబుదారితంగా ఉండేలా చర్యలు తీసుకుంటామని, రాష్ట్రంలో వివిధ గ్రామీణ ప్రాంతాలలో ఆర్టీఐ చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రతి సామాన్యుడికి వారి హక్కులను తెలియజేస్తూ, ఆర్టీఐ దరఖాస్తులు రాయడంలో, సమాచారం పొందడంలో సహకరిస్తున్న సొసైటీ సభ్యులను అభినందించారు.ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు ఎండీ.షరీఫ్, హనుమకొండ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ, వరంగల్ జిల్లా స్టూడెంట్ సెక్రటరీ ఎద్దు రాహుల్ పాల్గొన్నారు.

## కేసీఆర్ కుటుంబంపై రేవంత్ కీలక వ్యాఖ్యలు

**వేద న్యూస్, న్యూఢిల్లీ**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన ముగిసింది. కొత్త మంత్రులపై శాఖల కేటాయింపుపై సీఎం స్పష్టత ఇచ్చారు. తన దగ్గర ఉన్న శాఖలను కొత్త మంత్రులకు ఇస్తానని చెప్పారు. బుధవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో సీఎం మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలో కొన్ని నెలల వరకు మంత్రి పదవులు ఇవ్వలేదని, ఇచ్చినప్పటికీ శాఖలను కేటాయించలేదన్నారు. తాను మాత్రం రెండు మూడు రోజులకే శాఖలను కేటాయించినట్లు చెప్పారు.

అలాగే కేసీఆర్ కుటుంబంపై సీఎం పలు కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణకు కేసీఆర్ కుటుంబ సభ్యులే శత్రువులని, తాను ఉన్నంత వరకు కేసీఆర్ ఫ్యామిలీకి కాంగ్రెస్‌లోకి ఎంట్రీ లేదని కామెంట్స్ చేశారు. కులగణన సమయంలో కేసీఆర్, హరీష్ రావు, కేటీఆర్, కిషన్ రెడ్డి అందరి నివాసాలకు ప్రత్యేకంగా వెళ్లి వివరాలు స్వీకరించాలని హైదరాబాద్ కలెక్టర్‌కు ప్రత్యేకంగా సూచించినట్లు తెలిపారు. కేసీఆర్, కేటీఆర్, కిషన్ రెడ్డి, హరీష్ రావు సర్వేలో వివరాలు పంచుకోలేదన్నారు. కాళేశ్వరంలో ఏం జరిగింది, కాళేశ్వరంపై తనకు ఉన్న అభిప్రాయాలను రెండు మూడు రోజుల్లో విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి వివరిస్తానని ముఖ్యమంత్రి తెలిపారు.

కేంద్రమంత్రి కిషన్ రెడ్డిపై కూడా ముఖ్యమంత్రి విరుచుకుపడ్డారు. రాష్ట్రానికి అడ్డుపడుతుంది కిషన్ రెడ్డే అంటూ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాష్ట్రానికి ఒక ప్రాజెక్టు కూడా తీసుకురాలేదని విమర్శించారు. తెలంగాణ అభివృద్ధికి కిషన్ రెడ్డి ముందుకు వస్తే వారితో కలిసి వెళ్లేందుకు తాను సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073